

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం,22 అక్టోబర్ 2025

8 పేజీలు


## దేశానికి నిజమైన హీరోలు

# పోలీసులే

- పోలీసుల సంక్షేమం మా బాధ్యత
- సురక్షిత సమాజ నిర్మాణంలో పోలీసుల పాత్ర అమూల్యం
- రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్





**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో** : విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయక రేయింబవళ్లు దేశానికి సేవలు అందిస్తున్న పోలీసులే నిజమైన హీరోలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్థూపం వద్ద పుష్పగుచ్చులు ఉంచి పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం "అమరులు వారు"అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.కార్యక్రమాన్ని ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ దేశసంరక్షణ, శాంతి భద్రతల కోసంరాత్రి,పగలు, ఎండ ,వాన లెక్కచేయకుండాశ్రమిస్తున్న పోలీసులందరికీ రుణపడి ఉంటామన్నారు. విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుకుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. పోలీసులుగా బాధ్యత నిర్వహిస్తున్న వారికి నూతన ఉత్సాహం స్ఫూర్తిని నింపేందుకు, అమరులైన వారిని స్మరించుకునేందుకు ప్రతి ఏటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా జరుపుకుంటున్నామన్నారు.పోలీసులత్యాగాన్ని,విరోచిత పోరాటాలను స్మరించుకుంటూ వారికి నివాళులు అర్పించడం మన బాధ్యత అన్నారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 191 మంది పోలీసులు విధి నిర్వహణలో వీర మరణం పొందగా, వీరిలో ఆంధ్రప్రదేశ్లో ఐదుగురు, కోనసీమ జిల్లాలో ఇద్దరు ఉన్నారన్నారు. అమరులైన అమలాపురం ఎస్ఐ అశోక్ కుమార్ కుటుంబానికి, కానిస్టేబుల్ బ్లెసన్ జీవన్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయంతో పాటు, జ్ఞాపికలను మంత్రి సుభాష్, జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా చేతుల మీదుగా అందజేశారు. ఈరోజు మనమంతా ప్రశాంతంగా జీవిస్తున్నామంటే దాని వెనుక పోలీసుల కష్టం ఎంతో ఉందన్నారు.జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ 1959లో చైనా దురాక్రమనను భారత సైన్యం సమర్ధవంతంగా తిప్పి కొట్టినరోజని గుర్తు చేశారు. ఈసమరంలో

- తరువాయి 2లో..

## ఆలయాభివృద్ధికి

# సహకరించండి



- దేవాదాయశాఖ మంత్రి, కమిషనర్లను కలిసిన ఎమ్మెల్యే
- పలుఅభివృద్ధి పనులకుత్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కోరిన ఎమ్మెల్యే బండారు

**కొత్తపేట,మేజర్న్యూస్** : కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి అవసరమైన పనులు మంజూరు చేయాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని,కమిషనర్ రామచంద్ర మోహన్ లను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు.మంగళవారం తాడేపల్లిలోని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి క్యాంప్ కార్యాలయంనందు అలాగేవిజయవాడ గొల్లపూడి దేవాదాయ శాఖ కార్యాలయంలో కలుసుకొని పలు అంశాలపై చర్చించారు. తిరుమల తరువాత తిరుమలలా వాడపల్లి అభివృద్ధి చెందుతుందని వారికి తెలియజేశారు.ఏడు శనివారాల వెంకన్న దర్శనంతో ఆలయం శనివారం ఇల వైకుంఠాన్ని తలపిస్తుందని తెలిపారు.ఈ మధ్య ముగిసిన 13వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమాల గురించి ఆయనకు వివరించారు.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్న విషయాన్ని తెలియజేశారు. శనివారంతో పాటు మిగిలిన రోజుల్లోనూ భక్తులరద్దీ అధికంగా ఉంటుందన్నారు.ఉభయ తెలుగురాష్ట్రాల

- తరువాయి 2లో..

## పోలీసు అమరవీరుల

# త్యాగాలు వెలకట్టలేనివి

### - జిల్లా కలెక్టర్ షాన్మోహన్



**కాకినాడ,మేజర్న్యూస్** : విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి అన్నారు.పోలీసు అమరవీరుల దినోత్సవం పురస్కరించి మంగళవారం ఉదయం కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ఎస్పీ జి.బిందుమాధవ్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పెద్దాపురం ఎమ్మెల్యేనిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావులతో కలిసిఅమరవీరుల స్థూపంవద్ద పూల మాలికలు ఉంచి పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు.కార్యక్రమంలో ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు వందనం స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న భారత్-చైనా సరిహద్దుల్లోని అక్సాయ్ చిన్ వద్ద గస్తీ కాస్తూ, సియాచిన్ ప్రాంతాన్ని ఆక్రమించేందుకు మెరుపు దాడులకు దిగిన చైనా సైనికులను డీఎస్పీ కరమ్ సింగ్ నేతృత్వంలోని 10మంది పంజాబ్ సీఆర్పీఎఫ్ బృందం సాహసోపేతంగా నిలురించి వీరిచిత పోరాటంలోఅమరులయ్యారన్నారు.స్ఫూర్తిదాయకమైనవారిసేవలను, త్యాగనిరతిని,దేశభక్తిని సంస్మరిస్తూ ఏటా అక్టోబర్ 21తేదీని పోలీసులఅమరవీరుల సంస్మరణ

- తరువాయి 2లో..

## జాతీయ రహదారి విస్తరణ

# పనులు వేగవంతం చేయాలి

- నాలుగు రోడ్ల రహదారి ఆరు లైన్లుగా అభివృద్ధిపై సమీక్ష
- తూర్పు గోదావరి జిల్లా పరిధిలో 11 కి.మీ. పనులపై సమీక్ష
- సమీక్షలో ప్రజా ప్రతినిధులు మెరుగైన సూచనలను చెయ్యడం జరిగింది -ఎంపీ పురంధరేశ్వరి



**రాజమహేంద్రవరం,మేజర్న్యూస్** : రహదారి మౌలిక సదుపాయాలఅభివృద్ధి దేశఆర్థికప్రగతికి ప్రతిబింబమని, జాతీయరహదారుల విస్తరణ ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి అన్నారు. 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదిత పనులను,గౌరవప్రజా ప్రతినిధులు వెల్లడించిన అంశాలను దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంగళవారం రాజమహేంద్రవరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అనకాపల్లి-అన్నవరం-దివాన్ చెరువు సెక్షన్లోని NH-16 రహదారిని ఆరు లేన్ల పాక్షిక యాక్సెస్ నియంత్రిత హైవేగా విస్తరించే పనుల పురోగతిపై ఆమె సమీక్షించారు.ఈసమావేశంలో ప్రజా ప్రతినిధులు,నేషనల్ హైవేస్అథారిటీఆఫ్ ఇండియా, కన్సల్టెన్సీ సంస్థలు, జిల్లా అధికారులు,

- తరువాయి 2లో..

# పశుసంవర్ధక రంగ అభివృద్ధి రైతు ఆదాయాన్ని పెంపొందించడంలో కీలకం



## -జిల్లాలో గోఆధారిత ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామ స్థాయిలో విస్తరించాలి -కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** పశుసంవర్ధక రంగం అభివృద్ధి రైతు ఆదాయాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని,గో ఆధారిత ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామ స్థాయిలో బలంగా విస్తరించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు.మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ ప్రగతి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి పశుసంవర్ధక శాఖ కార్యక్రమాల అమలు, మండలాల వారీగా సాధించిన పురోగతిని సమీక్షించి, అధికారులు లక్ష్యాలను సమయానుసారం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, గోకులం షెడ్ల లక్ష్యాలను సాధించేందుకు రైతుల నుండి దరఖాస్తులు సేకరించి, వాటి ప్రకారం మంజూరులు తీసుకోవాలని సూచించారు. బహు వార్షిక పశుగ్రాసాల లక్ష్యాలను సమయానికి సాధించాలని, KPI ఆధారంగా ప్రతి మండలంలోని పురోగతిని కూలంకశంగా సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. గోఆధారిత ప్రకృతి వ్యవసాయంలో తెల్ల జాతి పశువుల ప్రాముఖ్యతను గుర్తించి, పశు ఆరోగ్య కార్యకర్తలు (AHA) ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమన్వయం చేసుకుని పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ప్రకృతి వ్యవసాయం పై పశు ఆరోగ్య కార్యకర్తలకు పూర్తి అవగాహన కలిగి ఉండేలా శిక్షణ, మార్గదర్శకాలు నిరంతరం ఇవ్వాలని సూచించారు. ప్రతి వారం నిర్వహించే జిల్లా సమీక్షల్లో ప్రకృతి వ్యవసాయం పై పశు ఆరోగ్య కార్యకర్తల అవగాహన స్థాయిని అంచనా వేసి,వారినితగినవిధంగా ప్రోత్సహించాలని అధికారులని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డా.టి.శ్రీనివాసరావు,డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్లు డా.సుంకవల్లి సత్యనారాయణ(కొవ్వూరు),డా.మక్కెన వెంకటేశ్వరరావు (రాజమహేంద్రవరం), అలాగే సబ్‌డివిజనల్ ఏరియా వెటెరినరీ హాస్పిటల్స్ అసిస్టెంట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## ఫోర్క్‌రాస్ ఫెస్ట్‌లో ఆదిత్య మహిళా డిగ్రీ మరియు పీజీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** స్థానిక సాంబమూర్తినగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ మరియు పీజీ కళాశాల మైక్రోబయాలజీ విద్యార్థులు ఫోర్క్‌రాస్ ఫెస్ట్‌లో చక్కని ప్రతిభ కనపరచి ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచి బహుమతులు సాధించారని ఆదిత్య మహిళా డిగ్రీ మరియు పీజీ కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలియజేశారు.ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.యల్ నాయుడు మాట్లాడుతూ చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని, విద్యార్థులు పోటీపరీక్షలకు హాజరవడానికి ఇలాంటి పోటీలు ఉపయోగపడ తాయని తెలియజేశారు.ఫోర్క్‌రాస్ ఫెస్ట్ పోటీలలో మైక్రోబయాలజీ తృతీయ సంవత్సరం విద్యార్థులు ప్రాజెక్టులో సత్య,తులసి మోహన, జామ్‌లో హసిని ప్రథమ స్థానాన్ని సాధించారు, ద్వితీయ సంవత్సర విద్యార్థులు పి.పి.టీ.లో హిమశ్రీ ప్రథమ స్థానాన్ని మరియు తృతీయ సంవత్సరం విద్యార్థిని సిరిప్రియ ప్రథమ స్థానాన్ని సాధించారు.ఈపోటీలలో ప్రథమ స్థానాన్ని సాధించిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ అభినందించారు.విజేతలను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.నాగ శ్రీకాంత్, మైక్రోబయాలజీ అధ్యాపకురాలు కె.నవ్య, ఎ.సాయి జాన్సీ మరియు ఎస్.భువనేశ్వరీ దేవి గెలుపొందిన విద్యార్థినిలను అభినందించారు.

## ప్రతిభ విద్యానికేతన్‌లో పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవం

**సామర్లకోట,మేజర్‌న్యూస్ :**స్థానిక ప్రతిభ విద్యనికేతన్ పాఠశాలలో పోలీస్అమరవీరుల సంస్మరణ దినోత్సవంను మంగళవారం ఘనంగా నిర్వహించారు.దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ ఈ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా స్థానిక పోలీస్‌స్టేషన్ సబ్‌ఇన్స్పెక్టర్ అడపా గరగరావు హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పోలీసుల త్యాగం, సేవాభావం, క్రమశిక్షణ గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులుఅందచేసారు.ఈకార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ యస్.వి.వి.జి. ప్రకాష్, ప్రిన్సిపల్ టి.సునీత,వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీ గౌరి, టి.సాయిరామకృష్ణ, జి.రాజు పోలీసు శాఖ సమాజ భద్రతలోని కీలక పాత్రను వివరించారు. చివరిగా అమర వీరుల జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులుఈ పోలీస్ అమర వీరుల సంస్కరణ దినోత్సవంను విజయవంతంగా ముందుకు తీసుకుని వెళ్లారు.

## జాతీయ రహదారి విస్తరణపనులు వేగవంతం చేయాలి

మొదటిపేజి తరువాయి

సంబంధిత విభాగాధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపీ పురంధరేశ్వరి మాట్లాడుతూ "ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా రహదారి సామర్థ్యాన్ని పెంచే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. అనకాపల్లి - దివాన్ చెరువు సెక్షన్6-లేన్లవిస్తరణ ప్రాజెక్ట్ తూర్పుగోదావరి, కాకినాడ, అనకాపల్లిజిల్లాలఆర్థికాభివృద్ధికి బాటలువేస్తుందన్నారు. రహదారుల ద్వారా పారిశ్రామిక,వాణిజ్యరంగాలు ఉత్సాహాన్ని పొందడం తో పాటు ప్రయాణ సమయం తగ్గి ఆర్థిక లాభాలు కలుగుతాయి" అని ఆమె పేర్కొన్నారు. 2027 పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని, రహదారి పనులు వేగవంతం చేయాలని ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి సూచించారు. "పుష్కరాల సమయంలో భక్తుల రాకపోకలు పెరగనున్న నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీని నివారించడానికి ప్రాజెక్టు పనులను సమయానికి పూర్తి చేయడం అత్యవసరం. జాప్యం లేకుండా భూసేకరణ, అనుమతుల మంజూరు, శాఖల సమన్వయాన్ని వేగవంతం చేయాలి"అని ఆమె పేర్కొన్నారు.స్థానిక ప్రజల అభిప్రాయాలను, ప్రజా ప్రతినిధుల సూచనలు పరిగణనలోకి తీసుకుని సమతుల్యమైన అలైన్‌మెంట్ తుదిరూపు ఇవ్వాలని ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరిఅధికారులకు సూచించారు .ఆవరోడ్డు, జెఎన్ రోడ్డు వద్ద అండర్ పాస్ రోడ్డు, ధవళేశ్వరం ప్రాంతంలో పనులు కోసం రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి కొన్ని ప్రతిపాదనలు ఇవ్వడం జరిగిందని ఎంపీ సమావేశంలో తెలియ చేశారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, "తూర్పు గోదావరి జిల్లా పరిధిలో సుమారు 11 కిలోమీటర్ల పొడవున ఈ జాతీయ రహదారి విస్తరించ నుందన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా, భూసేకరణ, పునరావాస ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేస్తాం అన్నారు. పనుల్లో జాప్యం లేకుండా అన్నిశాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.కృష్ణమూర్తి ప్రాజెక్ట్‌కు సంబంధించిన సమగ్ర వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రాజెక్ట్ మొత్తం 160.245 కి.మీ. పొడవున కొనసాగనుందని, ఇందులో తూర్పు గోదావరి జిల్లా భాగం రాజానగరం మండలం పరిధిలోని ఈస్ట్ గణుగూడెం, కలవచెర్ల, రాజానగరం, జగన్నాధపురం, వెంకటాపురం, నరేంద్రపురం, వెలుగు బండ గ్రామాల గుండా సాగుతుందని చెప్పారు. దివాన్ చెరువు వద్ద ప్రాజెక్ట్ ముగుస్తుందని, ప్రధాన జంక్షన్ల వద్ద ప్రమాద నివారణ చర్యల భాగంగా లైట్ వెహిక్యులర్ అండర్ పాస్‌లు, వాహన అండర్ పాస్‌లు, సురక్షిత క్రాసింగ్ మార్గాలు ప్రతిపాదించ బడ్డాయని వివరించారు.

ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, అడిషనల్ ఎస్పీ ఏ.వి. సుబ్బరాజు, జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామ మూర్తి, టెక్నికల్ మేనేజర్ వి.వి. రామకృష్ణ, సల్మాన్ అన్సారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కే. భాస్కర్ రెడ్డి, మేనేజర్ గోదావరి గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ పి. శ్రీకాంత్, పిసిబి ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ ఎం. శంకరరావు, జిల్లా మైన్స్ అధికారి డి. ఫణి భూషణ్ రెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ ఆర్. సత్యనారాయణ, ఏపీ ట్రాన్స్‌కో ఎస్.ఈ. టి. తిలక్ కుమార్, ఆర్ అండ్ బి ఎస్.ఈ. ఎస్‌బివి రెడ్డి, ఎడి మైన్స్ బి.లక్ష్మీనారాయణ, పి.ఆర్. ఎస్.ఈ.బాలకృష్ణ మరియు ఇతరశాఖల అధికారులు,ఏజెన్సీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## దేశానికి నిజమైన హీరోలు పోలీసులే

మొదటిపేజి తరువాయి

ఎంతోమందిసైనికులు అమరులయ్యారన్నారు. ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ పోలీసుల సంక్షేమానికి, భద్రతకుఅవసరమైన అన్నిచర్యలు తీసుకుంటున్నామ న్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో నేరాలు అదుపునకు,శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో అమలాపురం ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు,శాసనమండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్, జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

## ఆలయాభివృద్ధికి సహకరించండి

మొదటిపేజి తరువాయి

నుంచి వెల్లువలా తరలివస్తున్న భక్తుల సౌకర్యార్థం ఇప్పటికే జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు, వాడపల్లిలో మరిన్నిఅభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరంఉంద న్నారు. ఇందుకోసం దేవాదాయశాఖ నుంచి అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలనికోరారు.వాడపల్లిఆలయ విశిష్టతను పురస్కరించుకొని స్వామివారిదర్శనం చేసుకునిస్వామివారి కృపకు పాత్రులు కావాలనిఆయనకుఆహ్వానం పలికారు.స్వామివారి ప్రసాదం ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు,ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధ రావు,మైగపులగురవయ్యనాయుడుతదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

మొదటిపేజి తరువాయి

దినంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. దేశంలో శాంతి భద్రతలను కాపాడుతూ, ప్రజా రక్షణకు ప్రాణాలను సైతం అర్పిస్తున్న పోలీస్ వీరుల సేవలు ఎనలేనివని అన్నారు.

ఏ ఆపద వచ్చినా ప్రతి ఒక్కరికీ ముందుగా గుర్తుకు వచ్చే ఆపద్బాంధవులు పోలీసులేనని కలెక్టర్ కొనియాడారు. దేశ, రాష్ట్రాభివృద్ధికి కీలకమైన శాంతి భద్రతలను పరిరక్షణకు పోలీసులు క్లిష్టమైన, ప్రమాదభరిత పరిస్థితుల్లో పనిచేస్తున్నారని,వారికి ప్రజలందరూ సదాకృతజ్ఞతాబద్ధత గా ఉంటాన్నారు. మారుతున్న సమాజంలో పోలీసులకు మరిన్ని కొత్త సవాళ్ళు ఎదురౌతున్నాయని, వాటిని సమర్ధవంతంగా అధిగమించేం దుకు శారీరకంగా, మానసికంగా మరింతసుధృడంకావాలని కోరారు. సేవ ద్వారా అనిర్వచనీయమైన ఆనందం, తృప్తి పొందే అవకాశం పోలీసులకే అధికమని, ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజల ఆదరాభిమానాలను పొందాలన్నారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీఎస్. శ్రీనివాసరావు ఈ సంవత్సరం దేశంలోను, రాష్ట్రంలోను విధి నిర్వహణలో మరణించిన పోలీస్ అమర వీరుల పేర్లు చదివి తెలియజేసారు.

దేశ వ్యాప్తంగా 191 మంది పోలీసులు అమరులు కాగా, ఇందులో రాష్ట్రానికి చెందిన వారు 5గురు ఉన్నారని తెలిపారు. పోలీస్ అమర వీరులను సంస్మరిస్తూ పెరేడ్ కమాండర్, ఇన్స్ పెక్టర్ ఎం.ఎన్. మూర్తి నేతృత్వంలో సాయుధ పోలీస్ దళం స్మృతి పెరేడ్ నిర్వహించింది.అలాగే కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ రెండు నిమిషాలు మౌనం పాటించి పోలీస్ వీరులకు స్మృతి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లాలో అమరులైన 14 మంది పోలీసు అమర వీరుల కుటుంబాల సభ్యులకు ఒక్కొక్కరికి రూ.10వేల రూపాయల నగదు, పండ్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ బిందుమాధవ్ అందించారు. అలాగే వారితో ఆత్మీయంగా ముచ్చటించి పోలీస్ అమర వీరుల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలియజేసారు.పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన్న రాజప్ప, కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పోలీసుల సేవలను, త్యాగాలను కొనియాడారు.కార్యక్రమంలో జిజిహెచ్ సూపరిండెంట్ డా.లావణ్య కుమారి,ఎస్బి డీఎస్పీ కెవివి సత్యనారాయణ, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, పలువురు సిఐలు, ఎస్సైలు, అమర వీరుల కుటుంబాల సభ్యులు, కానిస్టేబుళ్లు, తదితరులు స్థూపం వద్ద పూలు ఉంచి నివాళులు అర్పించారు. చివరిగా పోలీస్ అమర వీరులను స్మరిస్తూ పోలీసు కార్యాలయం నుండి భానుగుడి కూడలి వరకూ నిర్వహించిన ర్యాలీని కలెక్టర్, ఎస్పీ, ప్రజాప్రతినిధులు జెండా ఊపి ప్రారంభించారు.

# కాకినాడ జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వాసంశెట్టి కామేశ్వరరావు


జిల్లా అధ్యక్షులు వాసంశెట్టి కామేశ్వరరావు

**కాకినాడ,మేజర్‌న్యూస్** : సోమవారం నాడు కాకినాడ జిల్లా బిసి ఓబిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం సమావేశం జిల్లా అధ్యక్షులు రామానుజం శ్రీనివాస్ అధ్యక్షతన కాకినాడ రామారావుపేటలో నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు గుత్తుల వీరబ్రహ్మం ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈకార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం జిల్లా కార్యవర్గం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులు మరియు కాకినాడ జిల్లా కార్యవర్గ సభ్యులు కాకినాడ పట్టణ కార్యవర్గ సభ్యుల సమక్షంలోనూతన కార్యవర్గాన్నిఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా వాసంశెట్టి కామేశ్వరరావు (విద్యాశాఖ)ను,గౌరవ అధ్యక్షులుగా రామానుజన్ శ్రీనివాస్ (విద్యుత్ శాఖ)ను,ప్రధాన కార్యదర్శి జోగా రామకృష్ణ (వైద్యఆరోగ్యశాఖ),ఆర్థిక కార్యదర్శి శ్రీనరసింహామూర్తి (విద్యాశాఖ), రాష్ట్రశాఖ ఎగ్జిక్యూటివ్ మెంబరుగా గంటి రాధాకృష్ణ, కాకినాడ పట్టణశాఖ గౌరవ అధ్యక్షులు చోడే శ్రీనివాస్‌ను, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సంగాడి రాజసింహ వర్మ, అధ్యక్షునిగా కడలి నాగరాజు, ప్రధాన కార్యదర్శి ముక్తేశ్, జాయింట్ సెక్రెటరీగా ములంపాక శ్రీనివాసరావు నియమితులైనారు. వీరందరిని రాష్ట్ర అధ్యక్షులు అభినందించినారు. నూతన అధ్యక్షులు మాట్లాడుతూ జిల్లాలో గల కమిటీలు లేని మండలాలను సందర్శించి అన్ని మండలాలకు కమిటీలు ఏర్పాటు చేసి బలోపేతం చేస్తానని హామీ ఇచ్చారు. అటువంటిప్పుడే జిల్లా ప్రతిష్టంగా ఉంటుందని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కార్యవర్గం సభ్యులు సిద్ధి వెంకటేశ్వరరావు, అద్దంకి వెంకన్న బాబు, ముల్లు సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు దొమ్మేటి సుధాకర్, రాపాక శ్రీనివాస్, వీరభద్రరావు, డి.ఏడుకొండలు, టేకుమూడి శ్రీనివాస్, సత్య ప్రసాద్, గుత్తుల వెంకటేష్ మరియు జిల్లా ఉద్యోగులందరూ పాల్గొన్నారు.

# ప్రీ రిపబ్లిక్‌డే పరేడ్‌కు 'ఆదిత్య' విద్యార్థిని



**కాకినాడ, మేజర్ న్యూస్** : స్థానిక సాంబమూర్తినగర్‌లో గల ఆదిత్య మహిళ డిగ్రీ & పి.జి కళాశాలకు చెందిన విద్యార్థిని బి.నందిత తమ కళాశాల నుంచి ప్రీ రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలియజేసారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా. బి.ఇ.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ మహిళా కళాశాల విద్యార్థిని 2026 జనవరి 26న జరగబోవు గణతంత్ర్య వేడుకలలో నిర్వహించే పరేడ్‌లో ఎంపికైనందుకు ఆనందంగా ఉందని, విద్యార్థినులు అబ్బాయిలతో సమానంగా పోటిపడి తమ సత్తాను చాటిచెప్పినందుకు గర్వకారణం అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ సెప్టెంబరు 24వ తేదిన రాజమండ్రి ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహించి ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌లో తృతీయ సంవత్సరం విద్యార్థిని బి.నందిత ఎంపికవ్వడానికి ప్రోత్సహించిన జాతీయ సేవా పథకం కార్యనిర్వహణాధికారి పి.సురేఖ దేవి, ఫిజికల్ డైరెక్టర్ యన్.సత్యవతి లను అభినందించారు. బి.నందిత గుజరాత్‌లో జరుగు 7రోజుల ట్రెయినింగ్ మరియు ఎంపిక కార్యక్రమంలో పాల్గొనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.నాగ శ్రీకాంత్ మాట్లాడుతూ కుమారి బి. నందితను మరియు ప్రోత్సహించిన విద్యార్థిని తల్లిదండ్రులను అభినందించారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల అధిపతి డా॥ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ డా॥ నల్లమిల్లి సుగుణారెడ్డి ఎంపికైన విద్యార్థినిని మరియు కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు.

# కాకినాడ నగరపాలక సంస్థ నూతన కార్యాలయ భవననిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**కాకినాడ,మేజర్‌న్యూస్** : కాకినడ నగర పాలక సంస్థ నూతన కార్యాలయ భవన నిర్మాణ పనులను కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. మంగళవారం కాకినాడ నగరం సినిమా రోడ్‌లో నిర్మాణ దశలో ఉన్న కాకినాడ నగరపాలక సంస్థ నూతన కార్యాలయ భవన నిర్మాణ పనుల పురోగతిని ఆయన పరిశీలించారు.అధికారంతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.టి.సుధాకర్,సూపరిండెంట్ ఇంజనీర్ పి.వెంకట రావు భవన నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్‌కు వివరించారు. చారిత్రాత్మకమైన పాత భవనంలో ప్రస్తుతం కౌన్సిల్ సమావేశాలు మాత్రమే నిర్వహించడం జరిగిందని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. నూతన కార్యాలయ భవనం త్వరితగతిన పూర్తయ్యేలా, ఇందుకు అవసరమైన నిధుల విడుదల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలనలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, డీసీపీ కృష్ణారావు, ఎంహెచ్ఓ డా.పృధ్విచరణ్, ఏఈలు, డీఈలు తదితర అధికారులు పాల్గొన్నారు.

# కల్తీ మద్యం అరికట్టేందుకు 'సురక్ష' యాప్



**పెద్దాపురం,మేజర్‌న్యూస్**: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కల్తీ మద్యం అరికట్టడానికి ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని,పెద్దాపురం ప్రొహిబిషన్&ఎక్సైజ్ సిఐ కె.వి.వి.డి.అర్జునరావు తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లేస్టోర్‌కి వెళ్ళి ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేశాక రెండు ఎంపికలు వస్తాయని, ఒకటి వినియోగదారుడి కోసం, మరొకటి మద్యం దుకాణాల నిర్వాహకుల కోసం అని తెలిపారు. వినియోగదారుడు ఐ.ఎం.ఎల్ బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ప్రొడక్ట్‌ను ఎంపిక చేయగానే మద్యం బాటిల్‌పై ఉన్న నెంబర్, ఎక్కడ తయారయింది? ఎక్కడ నుంచి వచ్చింది? బ్రాండ్ పేరు? ధర వివరాలన్ని స్క్రీన్‌పై డిస్‌ప్లే అవుతుందన్నారు.బీర్‌బాటిల్స్‌కు త్వరలో స్కాన్‌సౌకర్యం కల్పించబడుతుందన్నారు.ఈవిధానంవలన కల్తీ మద్యం అమ్మకాలకు అవకాశం ఉండదని ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు.

# పోలీసు అమరవీరులకు ఘన నివాళులు



**రావులపాలెం,మేజర్‌న్యూస్** :సమాజంలోశాంతి భద్రతల పరిరక్షణలో విధి నిర్వహణలో ప్రాణాలను సైతం పణంగా పెట్టి సేవలందించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ రావులపాలెం పోలీస్ స్టేషన్ సిఐ ఎం.శేఖర్ బాబు, ఎస్సైలు జి.చంటి, కె.వి.రమణ, సిబ్బంది, పోలీసు అమరవీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రావులపాలెం పట్టణ సిఐ శేఖర్ బాబు మరియు సిబ్బందిపాల్గొని అమరుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా శేఖర్ బాబు మాట్లాడుతూ విధి నిర్వాహణలో ప్రాణత్యాగంచేసినపోలీసుల త్యాగాలు స్ఫూర్తిదాయక మని, ప్రజల శాంతి భద్రతల కోసం రాత్రింబగళ్లు కృషిచేసే ప్రతి పోలీసు సిబ్బంది అంకితభావానికి వందనం తెలుపుతున్నామని పేర్కొన్నారు. అమరుల త్యాగాల వల్లే నేడు సమాజంలో భద్రత స్థిరంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది హాజరై పోలీసు అమరుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# వైద్య సిబ్బందికి ప్రైమరీ హెల్త్ కేర్ ట్రైనింగ్




**రంపచోడవరం, మేజర్ న్యూస్** : రంపచోడవరం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో వైద్య సిబ్బంది ప్రైమరీ హెల్త్ కేర్ ట్రైనింగ్ మంగళవారం ప్రారంభించారు. రంపచోడవరం డివిజన్ సి పి హెచ్ సి ట్రైనింగ్ స్థానిక ఏరియా హాస్పిటల్ ఎంసిహెచ్ బ్లాక్‌లో ఎయిమ్స్ ఢిల్లీ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి లు, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్‌లకు కంప్రెహేన్సివ్ ప్రైమరీ హెల్త్ కేర్ ట్రైనింగ్ ప్రోగ్రాన్ని ఈనెల 21 నుండి ప్రారంభించడం జరిగింది. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాంను రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్, జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ సరిత, ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ శిరీష సందర్శించడం జరిగింది.

# అన్నా క్యాంటిన్ తనిఖీ చేసిన కమీషనర్ శ్రీకాంత్‌రెడ్డి



**పెద్దాపురం,మేజర్ న్యూస్** : పెద్దాపురం పురపాలక సంఘం కార్యాలయం ఎదురుగా ఉన్న అన్నాక్యాంటిన్‌ను మంగళవారం మున్సిపల్ కమీషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి తనిఖీ చేశారు. దీనిలో భాగంగా ఆహార నాణ్యతను పరిశీలించి, ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, అలాగే శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, అన్నా క్యాంటిన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మెప్మా విభాగంతో సమావేశం నిర్వహించి పురమిత్ర యాప్ డౌన్‌లోడ్స్ పెంచాలని మెప్మా సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే పట్టణంలోని మేజర్ డ్రైన్‌ను పరిశీలించి, ఇంజనీరింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ ఏఇ పి.వి.సుధాకర్, తదితరులు ఉన్నారు.

సూర్య
www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# నార్మల్ డెలివరీకి ప్రయత్నిస్తే ప్రాణమే పోయింది...



**- హై రిస్క్ పేషెంట్‌కు నార్మల్ డెలివరీ చేసిన వైద్యురాలు సుజాత**

**- బలవంతంగా బిడ్డను బయటకు తీయడంతో తల్లి మృతి,పసిబిడ్డకు విరిగిన చేయి**

**- పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఘటన**

**- ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగిన మృతురాలి బంధువులు**

**పిఠాపురం,మేజర్‌న్యూస్:**బలవంతంగా నార్మల్‌డెలివరీకి ప్రయత్నించడంతో బాలింత మృతి చెందిన ఘటన పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన దొండపాటి శ్రీ దుర్గ (25) గత కొంతకాలం నుంచి పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో క్రమం తప్పకుండా వైద్య సేవలు పొందుతున్నారు. ఈనెల 13న యధావిధిగా వైద్య పరీక్షలు కు హాజరు కాగా వైద్యులు సూచన మేరకు డెలివరీ కోసం హాస్పిటల్‌లో జాయిన్‌అయ్యింది. అప్పటికే ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌లో స్కానింగ్ చేయించుకోగా... ఉమ్మనీరు తక్కువుగా వున్నట్లు రిపోర్ట్‌లో తేలడంతో శ్రీ దుర్గ హై రిస్క్ పేషెంట్ గా ట్రీట్మెంట్ పొందుతున్నారు.ఈ సమయంలో వైద్యులు శ్రీ దుర్గకు బలవంతంగా నార్మల్ డెలివరీ చేయడంతో...బిడ్డతో పాటు గర్భసంచి కూడా బయటకు వచ్చి తీవ్రంగా రక్తస్రావం అయ్యింది.పరిస్థితి విషమించడంతో ఇక్కడ వైద్యులు ప్రైవేట్ అంబులెన్సు మీద కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. అప్పటికే శ్రీ దుర్గ ఆపస్మారక స్థితికి చేరడంతో పాటు గుండెకు సంబందించిన సమస్యలు తలెత్తాయి. వెంటనే గర్భసంచి తీసేయడానికి డాక్టర్‌లుఆపరేషన్ చేశారు. పరిస్థితి చేయిదాటిపోవడంతో శ్రీ దుర్గ చనిపోయింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన కూతురు శ్రీ దుర్గమృతి చెందిందని తల్లి దండ్రులు దొండపాటి రాజు, సుబ్బారావు ఆరోపించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మంగళవారంనిరసనకుదిగారు. ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సుజాతపై ఆగ్రహం వ్యక్తం చేసారు.ఈ సమయంలో పరిస్థితి విషమించడం తో పిఠాపురం ఎస్సైతో పాటు సిబ్బంది వచ్చి బాధితులకు నచ్చచెప్పారు. మిగిలిన రోగులు ఇబ్బంది పడతారని ఆందోళన చేయవద్దని సూచించారు. విషయం తెలుసుకున్న గొల్లప్రోలు జడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు హాస్పిటల్‌కు చేరుకుని బాధితులు తరుపున డాక్టర్ సుజాత ను సంఘటనకు సంబందించిన విషయాలు తెలుసుకున్నారు.డాక్టర్‌సుజాత నిర్లక్ష్యం కారణం గానే నాబిడ్డ చనిపోయిందని తల్లిదండ్రులు ఆరోపించారు. మేము వద్దు అని చెప్పినా బలవంతంగా డెలివరీ చేసారన్నారు.ప్రైవేటుభాగం ద్వారంలో లీటర్ కొబ్బరి నూనెవేశారని సోదరి వేమగిరి సత్యాలత తెలిపారు. తన సోదరిని చాలా ఇబ్బంది పెట్టారన్నారు.నొప్పులు బాధతో అల్లాడి పోతున్న నా సోదరిని చెంప మీద డ్యూటీలో వున్న డాక్టరమ్మ డెలివరీ సమయంలో కొట్టిందని, బలవంతంగా డెలివరీ చేయడం వల్ల పుట్టిన బిడ్డ కుడి చేయి,కన్ను పనిచేయడం లేదన్నారు.మృతురాలు కుటుంబాన్ని ఆదుకోవాలని, వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మృతి చెందిన శ్రీ దుర్గ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి జడ్పీటీసీ నాగ లోవరాజు డిమాండ్ చేశారు.ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులతో కలసి పాడా పీడీ చైత్ర వర్షిణికు పిర్యాదు చేసారు. జరిగిన విషయాన్ని పీడీ కు వివరించారు. సంఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. షెడ్యూల్ క్యాస్ట్‌కు చెందిన కుటుంబం కాబట్టి ప్రభుత్వ పరంగా ఆదుకోవాలన్నారు. పుట్టినబిడ్డ కు చేయి, కన్ను పనిచేయడం లెనందున మెరుగైన వైద్య చికిత్స చేయించాలని కోరారు. దీనిపై స్పందించిన పీడీ విషయాన్ని జిల్లా కలెక్టర్ ద్రుష్టికి తీసుకెళ్తానన్నారు. వైద్యురాలిగా, గైనకాలజిస్ట్‌గా తనకు 18 సంవత్సరాలు అనుభవం ఉందని, పేషెంట్ పరిస్థితిని బట్టి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని, పేషెంట్ డెలివరీ సమయంలో కనీసం సహకరించలేదని డాక్టర్ సుజాత తెలిపారు.

# హాస్టళ్లను తనిఖీ చేసిన ఆర్డిఓ కే.శ్రీ రమణి



పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ : ఎద్దాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి కే.శ్రీ రమణి, తహసిల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి తో కలిసి మంగళవారం సుధా కాలనీలో ఉన్న సోష ల్ వెల్ఫేర్ కాలేజీ బాయ్స్ హాస్టల్, మహాత్మా జ్యోతిబా పూలే దీజ వెల్ఫేర్ హాస్టల్,మరియు లూథరన్ హైస్కూల్‌లోని పాఠశాల పిల్లల దీజ వెల్ఫేర్ హాస్టల్‌లను తనిఖీ చేశారు. ఈ తనిఖీ లో విద్యార్థులకు రోజూ అందుతున్న వసతులు, భోజనం, పరిశుభ్రత తదితర అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటశాలలను పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. హాస్టళ్లలోని వాతావరణం, పరిశుభ్రత, విద్యార్థుల అవసరాలు వంటి అంశాలపై వారు విడివిడిగా విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకోవడం జరిగింది.ఈ తనిఖీలో ఆయా హాస్టళ్ల వార్డెన్లు పాల్గొన్నారు.హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతులు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని హెచ్ డబ్ల్యు ఓలను ఆర్డీవో శ్రీ రమణి ఆదేశించారు.

# కూటమిలో విబేధాలు అన్న వార్తలకు మంత్రి కందుల దుర్గేష్ చెక్

**-కూటమి కలిసే ఉంటుంది..**

**కూటమి మధ్య చిచ్చు పెట్టాలని చూస్తే సహించమని హెచ్చరిక**

**- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్**

**నిడదవోలు, మేజర్‌న్యూస్ :** నిడదవోలులో కూటమి మధ్య ఎలాంటి తారతమ్య బేధాలు లేవని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. కూటమి అంతా ఒకేతాటిపై నిలబడి ఉందని ఘంటాపథంగా తెలిపారు. నామినేటెడ్ పోస్టుల విషయంలో ప్రతి మండలంలోని కూటమి నాయకులు చర్చించుకున్న అనంతరమే లోతుగా అధ్యయనం చేసి అందరికీ సముచితమని అనుకున్నాకే ఎంపిక చేస్తున్నామని పేర్కొన్నారు. కూటమిలో విబేధాలు సృష్టించేలా కొన్ని ఛానళ్లు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నాయన్నారు. కూటమిలో వైషమ్యాలు సృష్టిస్తూ వక్రీకరిస్తున్నారని అన్నారు. కూటమిలో విభేదాలు సృష్టించాలనుకుంటే సహించేది లేదని హెచ్చరించారు.



కూటమి కలిసే ఉంటుంది..కలిసే ఉండి బుద్ధి చెప్తామని స్పష్టతనిచ్చిన మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా కూటమిలో విబేధాలు అన్న వార్తలకు చెక్ పెట్టారు. కొందరు వ్యక్తులు, కొన్ని సంస్థలు వాస్తవాలు తెలుసుకోకుండా అనవసర దుష్ప్రచారాలకు తెరతీయడం మంచి పద్ధతి కాదని, సామాజిక బాధ్యతతో కథనాలు రాస్తే, ప్రసారాలు ప్లే చేస్తే ఎవరైనా హర్షిస్తారని పేర్కొన్నారు. వ్యక్తిగత విద్వేషాలు రెచ్చగొట్టేలా, పార్టీల మధ్య వైషమ్యాలు సృష్టించేలా కుట్రపూరితంగా, అక్కసుతో వార్తాకథనాలు రాయడం జర్నలిజం అనిపించుకోదన్నారు.

## భవిత కేంద్రంను పరిశీలించిన ఎంఈఓ వి.ఆర్.కె.చౌదరి



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో స్థానిక మహాత్మా గాంధి మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో సమగ్ర శిక్షా ద్వారా నడపబడుతున్న భవిత కేంద్రం నందు మంగళవారం పెద్దాపురం మండల విద్యాశాఖాధికారి-2 వి.ఆర్.కె.చౌదరి ఫిజియోథెరపి పరిశీలించారు. దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఫిజియోథెరపి కేంద్రంలో ప్రతీ మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు 0-18 సం.ల వయసు గల శారీర వైకల్యం గల పిల్లలందరూకు ఈ ఫిజియోథెరపి శిబిరం నిర్వహించబడుతుందని, భవిత పిల్లల తల్లితండ్రులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఓ తెలిపారు. మండలంలోని శారీరక వైకల్యం, మెదడు పక్షవాతం గల దివ్యాంగ పిల్లలకు ఈ భవిత కేంద్రంలో ప్రతీ మంగళవారం జరిగే ఫిజియోథెరపి సేవలను ఉచితంగా అందజేయడం జరుగుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలనిన్నారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం సహిత ఉపాధ్యాయులుబి.దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు, ఫిజియోథెరపిస్ట్ వి.అపర్ణ, భవిత విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాజవొమ్మంగిలో అమర పోలీసుల స్మారక దినం



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన రాజవొమ్మంగిలో అమర పోలీసుల స్మారక దినం స్థానిక సీఐ గౌరీ శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎస్సైలు శివకుమార్, చినబాబుల నేతృత్వంలో మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ నుండి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వరకు ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. పోలీస్ అమరవీరులకు జోహార్ జోహార్, జోహార్ పోలీస్ అమరవీరులకు జోహార్ జోహార్ అంటూ నినాదాలు చేస్తూ పోలీస్ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు భారీ ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అల్లూరి జంక్షన్ లో మానవహారం గా ఏర్పడి విధి నిర్వహణలో అమరులైన పోలీసుల ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. ఈ సందర్భంగా సిఐ గౌరీ శంకర్ మాట్లాడుతూ ప్రజలు మానప్రాణాలు కాపాడడంలో ప్రాణాలు పణంగా పెట్టి అమరులైన పోలీస్ వీరుల త్యాగాలు వెలకట్టలేనివని వారి సేవలను కొనియాడారు. అమర పోలీసులకు ఘన నివాళులు అర్పించారు.

## నేడు మండల ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభం

**- ముఖ్య అతిథిగా పాల్గొననున్న ఎమ్మెల్యే రాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు**



పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మండల స్థాయి 2025 క్రీడా పోటీలు బాలురు మరియు బాలికలకు మహారాణి కాలేజ్ నందు బుధవారం ఉదయం9 గంటలకు ప్రారంభిం చబడునని మండల విద్యాశాఖాధికారులు ఈరంకి ప్రభాకర శర్మ, వి.ఆర్.కె.చౌదరిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు తెలుపుతూ ఈ క్రీడా పోటీలను పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)లు ప్రారంభించనున్నారని,దీనిలో భాగంగా ఎంఎస్ఓ మట్టా సుబ్బారావు ఆధ్వర్యంలో కబడ్డీ,ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్,యోగా ,చెస్ క్రీడా పోటీలు నిర్వహిస్తారని, దీనికి సంబంధించి అండర్-14 (ది.1-1-2012), అండర్-17 (ది.1-1-2009)విద్యార్థులకు ఈక్రీడలు నిర్వహించబడునని వారు తెలిపారు.ఈకార్యక్రమంలో సీనియర్ వ్యాయమ ఉపాధ్యాయులు వరసధనం,సుబ్బారావు, ఉన్నారు.

# నిర్లక్ష్యంతోనే గిరిజన మహిళ బాపనమ్మ మృతి





**- వైద్యులపై క్రిమినల్ కేసుకు డిమాండ్**
**- వరుస మరణాలతో గిరిజనులు ఆందోళన**

**రంపచోడవరం, మేజర్ న్యూస్** : రంపచోడవరం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంకెంత మందిని చంపుతారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు మండిపడుతున్నారు. గిరిజన మహిళ కోటం బాపనమ్మది సహజ మరణం కాదని, ముమ్మాటికీ హత్యేనని, ఇందుకు బాద్యులైన వైద్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని ఆదివాసీ నాయకులు డిమాండ్ చేసారు. రంపచోడవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యులు నిర్లక్ష్యం, తప్పిదం వల్ల ఒక నిండు ప్రాణం బలి అయిందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను మంగళవారం ఆవేదన వ్యక్తంచేసారు. రంపచోడవరం మండలం నరసాపురం గ్రామానికి చెందిన గిరిజన మహిళ, రాజన్న దొర భార్య కోటం బాపనమ్మ ప్రసవం కోసం 12 రోజులు ముందుగా రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో జాయిన్ అవ్వడం జరిగిందని తెలిపారు. కాగా 19వ తేదీ ఉదయం ప్రసవ కాన్పులు వచ్చినట్లు ఉండటంతో ఆమెను ఉదయం 6 గంటల సమయంలో ఆపరేషన్ థియేటర్‌కు తీసుకువెళ్లారన్నారు. ఎనిమిది గంటల వరకు ఆపరేషన్ థియేటర్లో వైద్య సిబ్బంది బలవంతంగా డెలివరీ చేసే ప్రయత్నం చేయడంతో బిడ్డ కొంత భాగం బయటకు వచ్చి ఆగిపోయిందని, ఆ సమయంలో అన్ని రకాల ఏర్పాట్లు చూసుకోకుండానే హడావుడిగా డాక్టర్లు ఆపరేషన్ చేసారన్నారు. ఆపరేషన్ చేసిన అనంతరం తెలిసిన విషయం ఏమిటంటే బ్లడ్ ఆమెకి రెండు గ్రాములు మాత్రమే ఉన్నట్టు రిపోర్టర్ రావడం జరిగిందన్నారు. రెండు గ్రాములు మాత్రమే బ్లడ్ ఉన్న సమయంలో ఆపరేషన్ చేయడంతో ఉన్న కొంత బ్లడ్ మొత్తం పోయి బాలింతరాలు పూర్తిగా నల్లగా మారిపోవడం జరిగిందని, స్పర్శ తెలియ లేదని, ఆమెతో పాటు ఉన్న వారి కుటుంబ సభ్యులకు తెలియజేసినట్లు తెలిపారు. పుట్టిన మగ బిడ్డ ఉమ్మ నీరు తాగారని, చెప్పి, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని, అదే సమయంలో తల్లిని మంచి వైద్యం కోసం తరలించి ఉంటే ఆమె మృతి చెంది ఉండేది కాదన్నారు. ఆదివారం రాత్రి వరకు ఏరియా ఆసుపత్రిలోనే ఉంచి పరిస్థితి పూర్తిగా విషమించిన తర్వాత డాక్టర్లు తప్పించుకోవడం కోసం రాత్రి 12:30- 1:00 సమయంలో హడావుడిగా బాలింతరాలు బాపనమ్మను రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారని, రాజమండ్రి చేరుకున్న తర్వాత అక్కడ హాస్పిటల్ డాక్టర్స్ తల్లిని కాపాడటానికి విశ్వ ప్రయత్నాలు చేశారని, కానీ రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో వైద్యులు నిర్లక్ష్యం, తప్పిదం వల్ల, కేవలం రెండు గ్రాములు బ్లడ్ ఉన్నప్పుడు ఆపరేషన్ చేయడం వల్ల బాలింతరాలు ఆరోగ్య పరిస్థితి పూర్తిగా విషమించిందని, రాజమండ్రి డాక్టర్లు ఎంత ప్రయత్నించినప్పటికీ ఆమె ప్రాణాలను కాపాడలేకపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. మాతా శిశు మరణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పదేపదే చెప్పే జిల్లా అధికారులు కేవలం పేపర్ ప్రకటనలకు మాత్రమే పరిమితమైపోతున్నారని కుంజ శ్రీను ఆరోపించారు. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో వరుసగా మాత శిశు మరణాలు సంభవిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పథకాలు ప్రచారం చేసే ఉత్సాహం తప్ప ఆదివాసీలు ప్రాణాలు కాపాడే విషయంలో చూపించకపోవడం బాధాకరమన్నారు. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో పనిచేసే డాక్టర్లపై అనుమానాలు ఉన్నాయని, వారు నిజమైన డాక్టర్లేనా అని, వారి డాక్టర్ సర్టిఫికెట్లపై విచారణ జరిపాలని ఆయన డిమాండ్ చేశారు. కోటం బాపనమ్మ మృతి ముమ్మాటికీ డాక్టర్ల హత్యగా పరిగణించాలన్నారు. బాపనమ్మ మృతికి కారకులైన వైద్యులపైన, ఆసుపత్రిలో సరైన పర్యవేక్షణ లేని సూపరింటెండెంట్, జిల్లా వైద్య అధికారిపై క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపించాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఏమాత్రం సహించేది లేదని ఏజెన్సీలో వరస మరణాలు సంభవిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు దున్నపోతు మీద వర్షం పడ్డట్టు వ్యవహరిస్తున్నారని, దీనిపై ఉద్యమం ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ముందుగా అల్లూరు జిల్లా కలెక్టర్‌ను తక్షణమే బదిలీ చేయాలన్నారు. గతంలో మాతా శిశు మరణాలు జరుగుతున్నప్పుడు నిర్లక్ష్యం వహించిన డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకొని ఉంటే ఆదివాసులకు ఇటువంటి గతి పటేది కాదని, అమాయక ఆదివాసులు ఏమి మాట్లాడలేరు కాబట్టి అధికారులు ఆటలాడుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేసారు. మృతురాలు బాపనమ్మ స్వగ్రామానికి ఆదివాసి సంక్షేమ పరిషత్ బృందం వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేయడం జరిగింది. కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శిశువుకు మంచి వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ ఉపాధ్యక్షులు బొరగ ఎర్రమ్మ, ప్రధాన కార్యదర్శి జోడి ప్రదీప్ కుమార్ దొర, డివిజన్ నాయకులు కంగల అబ్బాయి దొర, చోడి ఏడుకొండలరావు దొర, పరదా శివరామకృష్ణ దొర, కలుముల జోగిరాజు దొర తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు ఉచితంగా దీపావళి మందులు పంపిణీ



**-పిల్లల కళ్ళల్లో ఆనందం చూడడం కోసమే దీపావళి మందులు పంపిణీ**
**-వశిష్ట వినియోగదారుల సంఘం అధ్యక్షుడు సలాది ఉదయ భాస్కర రావు**

**పెరవలి, మేజర్ న్యూస్** : దీపావళి అంటేనే పిల్లలు పండుగ అని దీపావళి పండుగను చిన్నపిల్లల ఆనందోత్సహాల మధ్య జరుపుకోవాలని పిల్లల కళ్ళల్లో ఆనందం చూడటం కోసమే గత 9 సంవత్సరాలుగా ముక్కామల గ్రామంలోని పిల్లలకు దీపావళి మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని వశిష్ట వినియోగదారుల సంఘం అధ్యక్షులు, పెరవలి మండలం లయన్స్ క్లబ్ సెక్రటరీ, ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఏవోఐ అధ్యక్షులు సలాది ఉదయభాస్కరరావు అన్నారు. అక్టోబర్ 20 వ తేదీ సోమవారం దీపావళి సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ముక్కామల గ్రామంలో చిన్నారులకీ బిస్కెట్ ప్యాకెట్, దీపావళి మందులతో కూడిన సంచులు పంపిణీ చేశారు. ఈ సంవత్సరం దీపావళికి తన తల్లిదండ్రులు రిటైర్డ్ లైబ్రేరియన్ సలాది వీర వెంకట సూర్యనారాయణ శ్రీమతి రాజేశ్వరి దంపతులు హైదరాబాద్లో సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా పనిచేస్తున్న తన పెద్ద కుమార్తె సలాది దుర్గాభారతి అల్లుడు హర్షవర్ధన్ దంపతులు, చిన్న కుమార్తె డాక్టర్ సలాది శ్రీ రాజేశ్వరి ఎంబిబిఎస్ మక్కామల వచ్చి ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు అన్నారు.ప్రతి ఏటా ఇలా దీపావళి మందులు ఉచితంగా ఇస్తూ ఉండటంతో గ్రామంలోని పిల్లలందరూ భారీగా తరలి వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పిల్లల కేరింతలతో సందడితో ఆ పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి.గత తొమ్మిది సంవత్సరాలుగా దీపావళి టపాసులు పిల్లలకు ఉచితంగా అందించడానికి స్ఫూర్తినిచ్చిన తన మిత్రులు నల్లాకుల వెంకటేశ్వరరావు, అడబాల శ్రీను, నల్లాకుల వాసు లకు సలాది ఉదయ భాస్కర రావు కృతజ్ఞతలు తెలియజేశారు.

# శ్రీ మరిడమ్మ అమ్మవారిని కలువ పువ్వులతో ప్రత్యేక అలంకరణ



**108 ప్రసాదాలతో అమ్మవార్కి నివేదన**
**- అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు**
**- ఆకట్టుకున్న దీపాలరంకరణ**
**- అమ్మవారిని దర్శించుకున్న ఎస్పై మౌనిక**

**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్** : పెద్దాపురం పట్టణంలో వేంచేసి యున్న శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు దీపావళి సందర్భంగా దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో శ్రీ మరిడమ్మ అమ్మవారిని కలువపూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడం జరిగింది. అలాగే దేవస్థానంలో ప్రత్యేక దీపాలరంకరణ ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా పెద్దాపురం ఎస్సై మౌనిక దీపావళి సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. వీరికి దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ జాకెట్ ముక్క, తాంబూలం, ప్రసాదం అందజేశారు. అమ్మవార్కి 108 ప్రసాదాలతో నివేదన కార్యక్రమం నిర్వహించారు. పెద్దాపురం పట్టణం నుండే కాకుండా చుట్టుప్రక్కల పరిసర ప్రాంతాల నుండి వందలాది సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవస్థాన ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణి నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులురాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, క్రాంతివీర్, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

## తీపర్రులో మహిళలకు విత్తన ప్యాకెట్లు పంపిణీ

**-పెరటి పంటలు ప్రోత్సాహమే ముఖ్య ఉద్దేశం**
**-స్వంత ఖర్చుతో విత్తనాల ప్యాకెట్లు పంపిణీ చేసిన కంటిపూడి సూర్యనారాయణ**



**పెరవలి, మేజర్‌న్యూస్** : మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని రసాయన ఎరువులు పురుగుమందులు లేకుండా ప్రకృతి విధానంలో కూరగాయలు, ఆకుకూరలు పెంచి విషరహిత ఆహారం అందరికీ అందించాలనే స్ఫూర్తితో స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్.. స్వర్ణ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని తీపర్రు సొసైటీ అధ్యక్షులు కంటిపూడి సూర్యనారాయణ అన్నారు. అక్టోబర్ 21వ తేదీ మంగళవారం పెరవలి మండలం తీపర్రు గ్రామంలో ఈడుపుగంటి రత్తమ్మ సత్రంలో జరిగినఒకకార్యక్రమంలో కంటిపూడి సూర్య నారాయణ తన సొంత ఖర్చుతో సభకు హాజరైన అంగన్వాడీలు, డ్వాక్రా మహిళలు, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు విత్తనాల ప్యాకెట్లు అందించారు. ఈ కార్యక్రమం తరువాత తీపర్రు గ్రామంలో ఇంటింటికి విత్తనాలు ప్యాకెట్లు అందించి పెరటి తోట పెంపకాలకు ప్రాధాన్యత కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ తాతారావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించిన ప్రతి రైతు అతి తక్కువ ఖర్చుతో తమ పంటలను పండించుకుంటున్నారని అత్యంత పోషక విలువలు ఉన్న రసాయన రహిత ఆహారాన్ని సమాజానికి అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్ట్ మేనేజర్ వలి, వ్యవసాయ అధికారి మేరీ కిరణ్, ఏపిఎం రామకృష్ణ, జనసేన నాయకులు ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్, కర్రి ఆంజనేయులు, తెదేపా గ్రామ అధ్యక్షుడు మొగలపు సీతారామ్, బిజెపి నాయకులు సింహాద్రి సత్యనారాయణ, స్థానిక రైతులు, అంగన్వాడీలు, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను అధికారులు విధిగా తనిఖీ చేయాలి



–డి.బ్లాక్ నందు పలు సమస్యలను స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే గోరంట్ల

**రాజమహేంద్రవరం రూరల్, మేజర్ న్యూస్** : గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను అధికారులు విధిగా తనిఖీ చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు.
మంగళవారం హుకుంపేట పంచాయితీ డీ.బ్లాక్ నందు నిర్మాణంలో ఉన్న డ్రైనేజీ పనులను మరియు పారిశుద్ధ్య పనులను స్వయంగా పరిశీలించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఇప్పటికే రూరల్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడం జరిగిందని తెలిపారు. అభివృద్ధి పనులు జరుగుతున్న సందర్భంలో ఆక్రమణలు తొలగించడం సహజమని, ఆ క్రమంలో డ్రైనేజీ నిర్మాణ పనులు కొంత జాప్యం అవుతాయని వివరించారు. నిర్మాణ పనులు జరుగుతున్న కారణంగా మురుగునీరు బయటకు పోయేందుకు వీలు లేక మురుగునీరు నిల్వ ఉండి ఇబ్బందులు పడుతున్నారని స్థానిక మహిళలు తెలుపగా, స్థానిక రైతులతో మాట్లాడి పనులు పూర్తి అయ్యే వరకు మురుగునీరు బయటకు పోయేందుకు సహకరించాలని సూచించారు. నెల రోజుల వ్యవధిలో మొత్తం పనులు పూర్తి అవుతాయని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి డ్రైనేజీ నిర్మాణానికి కావలసిన స్థలాన్ని సర్వే చేసి వెంటనే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం విషయంలో ఎటువంటి అలసత్వం వహించినా చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు. తదుపరి, సాటిలైట్ సిటీ సి.బ్లాక్ నందు కళ్యాణ మండపం నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి, త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డి.ఇ రవికుమార్, ఏ.ఈ సంపత్ కుమార్, వాసిరెడ్డి బాబి, పెండ్యాల రామకృష్ణ, గారపాటి నాగేశ్వరరావు, కొల్లి దుర్గాప్రసాద్, సోమేశ్వరరావు, హీరా సింగ్, చామాంద్రి నాని, ఏఎంసీ డైరెక్టర్ బైరెత్తి సరోజినీ, నిచ్చినకోళ్ల సత్తిబాబు, ఎమ్మెస్సార్ శ్రీను, దారా అన్నవరం, పెంకే కోటేశ్వరరావు, బండారు సత్తిబాబు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అసిస్టెంట్ ప్రొఫెసర్ "గణేష్ పార్ధు"కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ



**గండేపల్లి, మేజర్ న్యూస్** : సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఇఇఇ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్గా పనిచేస్తున్న "బల్ల శ్రీ సత్య గణేష్ పార్ధు " జె,ఎన్.టి.యు. కె యూనివర్సిటీ కాకినాడ నుండి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జె,ఎన్.టి.యు. కె యూనివర్సిటీ కాకినాడ ఇఇఇ విభాగం విభాగాధిపతి ప్రొఫెసర్ డా.కె.వెంకటరెడ్డి నేతృత్వంలో శ్రీ సత్య గణేష్ పార్ధు సమర్పించిన "థీసిస్ శీర్షిక: "స్కీమ్స్ ఫర్ ఎఫెక్టివ్ ఇంటర్ కనెక్షన్ ఆఫ్ నాన్ – కన్వెన్షనల్ ఎనర్జీ సోర్సెస్ టు ది గ్రిడ్ యూజింగ్ మల్టీలెవెల్ ఇన్వెర్టర్స్ అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. డా. ""బల్ల శ్రీ సత్య గణేష్ పార్ధు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆదిత్య అధినేత, యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి, శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ . డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్. ప్రో. ఎం.బి. శ్రీనివాస్. ప్రో. వైస్ ఛాన్సలర్. డా. ఎస్. రమాశ్రీ, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా జి.సురేష్, ఇఇఇ విభాగాధిపతి మరియు వివిధ విభాగాల విభాగాధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది డా "బల్ల శ్రీ సత్య గణేష్ పార్ధుకు అభినందనలు తెలిపారు.

## మండలంలో ఘనంగా దీపావళి వేడుకలు






**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్** : మండలంలోని సోమవారం దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ధన త్రయోదశి, నరక చతుర్థి అనంతరం వచ్చే అమావాస్య రోజు సాయంత్రం నుండే ప్రతి ఇంటి ఆవరణలో మట్టి ప్రమిదలలో ఒత్తులు వేసి నువ్వుల నూనెతో దీపాలు వెలిగించారు. మహాలక్ష్మి అమ్మవారిని ఇంటిల్లి పాది పూజించి తీపి పదార్థాలు నైవేద్యంగా పెట్టి, శక్తి మేర బంగారు ఆభరణాలుతో అమ్మవారిని వేడుకున్నారు. గోము కర్రలతో దివ్వటలు కొట్టి పితృదేవతలకు వెలుగు చూపారు. ఆనందోత్సవాలతో టపాసులు,బాణసంచాలు పేల్చి కుటుంబ సభ్యులు సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా దుకాణాలు వద్ద ఎటువంటి ప్రమాదాలకు తావు లేకుండా స్థానిక సీఐ గౌరీ శంకర్ ఆధ్వర్యంలో ఎస్సైలు శివకుమార్, చినబాబుల నేతృత్వంలో పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించారు. అలానే సిఐ, ఎస్ఐలు ప్రశాంత వాతావరణంలో దీపావళి పండుగను జరుపుకోవాలని ప్రజలకు సూచించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

## ఏటిగట్టుపై బిటిరోడ్డు నిర్మాణానికి ఎంపీ పురందరేశ్వరికు వినతిపత్రం




**పెరవలి, మేజర్ న్యూస్** : విజ్ఞేశ్వరం టు సిద్ధాంతం ఏటిగట్టుపై తారు రోడ్ నిర్మాణం మరియు తీపర్రు గ్రామ సమగ్ర అభివృద్ధి కోసం అక్టోబర్ 21వ తేదీ మంగళవారం పెరవలి మండలానికి చెందిన భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు సింహాద్రి వీర వెంకట సత్యనారాయణ, జనసేన పార్టీ తీపర్రు గ్రామ అధ్యక్షులు ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మొగళ్ళపు సీతారాం, మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు నందమూరి నారాయణరావు, గ్రామ దేవస్థానం కమిటీ చైర్మన్ బలుసు వెంకట్రావు, ఎన్నమని భాస్కర్ రావు తదితరులు రాజమహేంద్రవరం నియోజకవర్గ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి దగ్గుబాటి పురందేశ్వరితో సవివరంగా చర్చించి వినతిపత్రం అందించారు. ఈ సమావేశంలో రాబోయే పుష్కరాలకు ఏర్పడే రద్దీకి అనుగుణంగా గ్రామాభివృద్ధి, రహదారి నిర్మాణం, ప్రజాసౌకర్యాల విస్తరణ వంటి అంశాలపై వివిధ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పెన్మెత్స సుబ్రహ్మణ్యం వర్మ, రంగినీడి గంగాధరరావు తోపాటు బిజెపి, తెదేపా, జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దళిత యువకున్ని పరామర్శించిన దళిత సంఘాల నాయకులు



**సామర్లకోట, మేజర్ న్యూస్** : సామర్లకోట పట్టణానికి చెందిన దడాల అక్షయ్ కుమార్ సోమవారం రాత్రి పోలీస్ కానిస్టేబుల్ దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. కాగా సోమవారం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న అక్షయ్ కుమార్ ను దళిత సంఘాల నాయకులు పరామర్శించారు. ప్రస్తుతం బాలుడికి అందుతున్న చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. దళిత యువకులను పరామర్శించిన వారిలో మాల మహానాడు జాతీయ అధ్యక్షులు ఆర్ఎస్ రత్నాకర్ లింగం శివ, నేతల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

### సాంఘిక సంక్షేమ శాఖ బాలుర, బాలికల హాస్టల్స్‌లో దీపావళి సంబరాలు నిర్వహించిన టిడిపి నాయకులు



**జగ్గంపేట, మేజర్ న్యూస్** : స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలుర, బాలికల హాస్టల్ నందు జగ్గంపేట టౌన్ తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా జగ్గంపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జీను మణిబాబు సమకూర్చిన దీపావళి టపాసులు, స్వీట్స్ విద్యార్థిని విద్యార్థులందరికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ ఎస్ అప్పలరాజు మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా హాస్టల్లోను విద్యార్థులందరికీ టపాసులు సమకూర్చాలని జీను మణి బాబును హాస్టల్ వార్డెన్ ప్రభాకర్ ఫోన్ చేసి కోరడం వెంటనే స్పందించిన మణిబాబు స్వీట్స్, టపాసులు తీసుకుని నాయకులతో కలిసి హాస్టల్లో పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. మణి బాబు మాట్లాడుతూ మీ అందరి కళ్ళల్లో ఆనందం చూడ్డానికి ఈరోజు నేను ఈ కార్యక్రమం చేపట్టానని ప్రతి ఒక్కరూ ఆనందంతో తగిన జాగ్రత్తలు తీసుకుని టపాసులు వెలిగించుకోవాలని మణిబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, రాయి సాయి, వేలిశెట్టి బుజ్జి, కోడూరి రమేష్, బాలాజీ రెడ్డి, హరి గోపాల్, హాస్టల్ వార్డెన్స్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# దీపావళిలో అపశృతి...



–పోలీసు దాడిలో యువకునికి ప్రాణాపాయం
–ఆసుపత్రి వద్ద దళిత సంఘాల ఆందోళన

**సామర్లకోట,మేజర్న్యూస్** : సామర్లకోట పట్టణంలో దీపావళి పండుగ సందర్భంగా అపశృతి ఏర్పడింది. యువకులను చెదరగొట్టే క్రమంలో ఒకకానిస్టేబుల్ చేతిలో గాయపడిన యువకుడు ప్రాణాపాయ స్థితికి చేరుకొగా అతనిని కాకినాడ ఆసుపత్రికి తరలించారు. స్థానికుల వివరాల ప్రకారం దీపావళి సందర్భంగా సోమవారం రాత్రి బ్రౌన్ పేట సెంటర్లో యువకులు పోటాపోటీగా తారాజువ్వలు వేసుకుంటుండగా రాత్రి 8.30 గంటల ప్రాంతంలో కానిస్టేబుల్ సతీష్ కుమార్ వచ్చి యువకులను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఈ క్రమంలో బ్రౌన్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంతానికి చెందిన దడాల అక్షయ కుమార్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అతనికి శ్వాస సంభంద ఇబ్బంది అధికంగా ఉండటంతో కదలిక లేకుండా పడి ఉండగా సిపిఆర్ అనంతరం స్పందించిన యువకుని మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. ఆ విషయం తెలుసుకున్న దళిత సంఘాల నాయకులు, ప్రజలు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని నిరసన తెలిపారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు లింగం శివ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో భాగంగా పెద్దాపురం డి ఎస్పీ డి శ్రీహరి రాజును, స్థానిక సిఐ ఎ కృష్ణ భగవాన్ లను ప్రజలు ముట్టడించారు. దళితులపై పోలీస్ దాడులు అరికట్టాలంటూ నినాదాలిచ్చారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకునికి ఏమైనా జరిగితే సాహించేది లేదని హెచ్చరిస్తూ దీనికి కారకుడైనా పోలీస్ కానిస్టేబుల్ ను సస్పెండ్ చెయ్యాలని నాయకులు డిమాండ్ చేశారు. కాగా కాకినాడ తరలించిన అక్షయ్ కుమార్ ఆరోగ్య పరిస్థితిని డి ఎస్పీ, సిఐ, ఎస్ ఐ లు తెల్లవారుజామున సందర్శించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. యువకుని ఆరోగ్యం కాస్త మెరుగానే ఉన్నదని, అతడు కోలుకుంటున్నాడని పోలీసులు తెలిపారు. కాగా సోమవారం రాత్రి జరిగిన సంఘటనపై మంగళవారం పోలీస్ ఇంటిలిజెన్స్ సిబ్బంది ధర్యాప్తు చేస్తూ సంఘటనా స్థలంలో వివరాలు సేకరించారు. సంఘటనపై కేసును స్థానిక సిఐ ధర్యాప్తు చేస్తున్నారు.

# బెల్ట్ షాపులపై పోరాటం



- అక్రమ బెల్ట్ షాపులు మూసివేత
- మాజీ ఎమ్మెల్యే

**అనపర్తి, మేజర్ న్యూస్** : అనపర్తి నియోజకవర్గంలో మద్యం ఏరులై పారుతుందని, గ్రామ గ్రామాన అక్రమ బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయని అక్రమ బెల్ట్ షాపుల వల్ల కల్తీ మద్యం తాండవిస్తుందని ఆ ప్రభావం ప్రజలపై పడుతుందని అక్రమ బెల్ట్ షాపులపై వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున నేతలు, కార్యకర్తలు కలసి చేపట్టిన పోరాటం ఫలితంగా కొన్ని చోట్ల అక్రమ బెల్ట్ షాపులు మూసివేసారని అనపర్తి మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ

ప్రతి గ్రామంలోనూ మెడికల్ షాప్ లు కన్నా బెల్ట్ షాపులు ఎక్కువగా ఉన్నాయని, ప్రతి గ్రామంలో వీధి వీధికి బెల్ట్ షాపులు విస్తరించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని , రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి తెచ్చిన కల్తీ మద్యం ఇక్కడ అమ్మకాలు జరగడంతో ప్రజా ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని, మద్యం విక్రయ కేంద్రాల వివరాలు ఎక్సైజ్ శాఖకు అందించినా, అధికారులు చర్యలు తీసుకోవడం లేదని అన్నారు.వైయస్ఆర్‌సీపీ తరపున పార్టీ నాయకులు, కార్యకర్తలు రంగంలోకి దిగి ఎక్సైజ్ సీఐని ప్రశ్నించడంతో అనేక బెల్ట్ షాపులు మూసివేసారని అన్నారు. కల్తీ మద్యం విక్రయం వల్ల అనేక కుటుంబాలకు ఆరోగ్య సమస్యలు, ముఖ్యంగా లివర్ వ్యాధులతో బాధపడుతున్నారని అన్నారు. "అక్రమ మద్యం కారణంగా ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలు తీవ్ర ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ప్రజల ఆరోగ్యం రక్షణ కోసం సర్వేలు, వైద్య శిబిరాలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నామని మాజీ ఎమ్మెల్యే అన్నారు.అక్రమంగా నిర్వహిస్తున్న అన్ని బెల్ట్ షాపులు పూర్తిగా మూయించేంతవరకు మా పోరాటం కొనసాగుతుందని అన్నారు.


# కెనాల్ రోడ్‌ను నేషనల్ హైవేగా మార్చు చేయాలి



-అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి

**అనపర్తి, మేజర్‌న్యూస్** : రాజమహేంద్రవరం టూ కాకినాడ కెనాల్ రోడ్ ను నేషనల్ హైవే గా మార్చుచేసి రోడ్డు నిర్మాణం త్వరత గతిన పూర్తిచేయాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రాజమహేంద్రవరంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జాతీయ రహదారుల అభివృద్ధి మరియు పనుల పురోగతిపై నేషనల్ హైవేస్ అధికారులతో సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి, జాయింట్ కలెక్టర్ మేఘా స్వరూప్ పాల్గొన్నారు. జాతీయ రహదారుల విస్తరణ, నాణ్యతా ప్రమాణాలు, ప్రజల సౌకర్యం దృష్ట్యా జరుగుతున్న పనులను పరిశీలిస్తూన్న అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాబోయే పుష్కరాలు దృష్టిలో ఉంచుకొని రహదారులను వేగవంతంగా పూర్తి చేయడం, నాణ్యత పనితీరు పట్ల కట్టుదిట్టమైన పర్యవేక్షణకు సూచనలు పాటించాలని, అదే విధంగా రాజమండ్రి – కాకినాడ కెనాల్ రోడ్ ను పీపీపీ మోడల్ లో అభివృద్ధి చేయడం కోసం కేంద్రానికి ప్రాతిపాదనలు పంపించడం జరిగిందని,రాబోయే పుష్కరాలు నేపథ్యంలో ఇటు కాకినాడ,ద్రాక్షారాం మరియు బిక్కవోలు, మామిడాడ టెంపుల్స్ కి వెళ్ళే రహదారులు రద్దీ పెరగడం జరుగుతుందని, వాటిని దృష్టిలో ఉంచుకొని సకాలంలో కెనాల్ రోడ్ ను నేషనల్ హైవేగా మర్చి శాశ్వత ప్రతిపాదికన అభివృద్ధి చేయాలని అన్నారు.

# దీపావళి సంబరాల్లో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ





**రంపచోడవరం, మేజర్ న్యూస్** : అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ కేంద్రంలో దీపావళి సంబరాలు సందర్భంగా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. స్థానిక శ్రీ విరాట్ విజయ ఆంజనేయ స్వామి సహిత శ్రీకోదండ రామాలయం ఆవరణ, నారాయణగిరిపై శ్రీరంప వేంకటేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణం, సంతమార్కెట్‌లో కొలువైన శ్రీవరసిద్ధి విఘ్నేశ్వర స్వామివారి ఆలయం, దేవి గుడి ఆలయాలు, సాయిబాబా మందిరంలో దీపాలంకరణ శోభయమానంగా వెల్లివిరిసింది. ఆలయ అర్చకులు లింగాల సీతారామాంజనేయ ప్రసన్న కుమార్ శర్మ, అద్దంకి వేంకటేశ్వరరావు, యజ్ఞసూర్య సాయి కిరణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమాలలో అధిక సంఖ్యలో భక్తులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు సార్ల చిన్నారెడ్డి (ఆర్ఎస్ఎస్) కుటుంబసహితంగా పాల్గొన్నారు.

అలాగే గుడ్ల అంక శ్రీనివాసరెడ్డి, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యవర్గ సభ్యులు అన్నవరెడ్డి కృష్ణ కిషోర్, నల్లమిల్లి వేంకట రామారెడ్డి, పింజర్ల నాగవీరభద్రరావు, రావూరి పుష్కరం దంపతులు, లీలానాగు వీరభద్రగుప్తా, వెలిశెట్టి వీరభద్ర ప్రసాద్, కారం సత్యవేణి, వెంకటలక్ష్మి, చక్రపాణి, జొన్నలగడ్డ బాలసత్యనారాయణ, శ్రీ విరాట్ విజయ ఆంజనేయస్వామి సహిత శ్రీ కోదండ రామాలయం ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు పాల్గొని దీపాల అలంకరణ చేసి దీపావళి సంబరాలు జరుపుకున్నారు.

కార్తీకమాసం అంతా దైవ సంబంధిత కార్యక్రమాలు చేస్తూ విశ్వమంతా సుఖ సంతోషాలతో ఉండాలని రంపచోడవరం హిందూ ధర్మ ప్రచార భక్త మండలి కో-ఆర్డినేటర్ నల్లమిల్లి వేంకటరామారెడ్డి ఆకాంక్షించారు.

## ఐటి విభాగంలో విజ్ఞానదాయకంగా గెస్ట్ లెక్చర్‌లి



**గండేపల్లి,మేజర్‌న్యూస్** : సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం మూడవ సంవత్సరం చదువుతున్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం విద్యార్థులు, సిఎస్ఐ స్టూడెంట్ చాప్టర్ సహకారంతో "ది మేకింగ్ ఆఫ్ ఎ విజనరీ ఎంటర్ప్రెన్యూర్" అనే అంశం మీద ఆన్ లైన్ గెస్ట్ లెక్చర్ విజయవంతంగా ముగిసింది. భారత ప్రభుత్వ ఉన్నత విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని చెన్నైలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ వి. వందన దేవి రిసోర్స్ పర్సన్ గా వ్యవహరించారు. డాక్టర్ వందన దేవి ప్రజెంటేషన్ "ది మేకింగ్ ఆఫ్ ఎ విజనరీ ఎంటర్ప్రెన్యూర్" అనే అంశంతో సహా అనేక ముఖ్యమైన అంశాలను వ్యక్తము చేసారు, ఇందులో రియల్-టైమ్ వ్యవస్థాపకులను ప్రదర్శించే రియల్ వీడియోలతో పాటు వ్యవస్థాపకత యొక్క ప్రాథమిక భావనలను ప్రదర్శించారు. విషనరీ వ్యవస్థాపకులు ఎలా ఆలోచిస్తారు, ఈ గెస్ట్ లెక్చర్ విద్యార్థులు కు వ్యవస్థాపకతలో సవాళ్లు మరియు అవకాశాలను బాగా అర్థం చేసుకోవడానికి సహాయపడింది.ఈ కార్యక్రమానికి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.వీరాంజనేయులు, మరియు డాక్టర్ ఎస్. గోవిందరాజన్ వ్యవహరించారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎం.బి. శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడెమిక్స్) డాక్టర్ ఎస్. రమాశ్రీ, ప్రో వైస్ ఛాన్సలర్ రోన్(ఇంజనీరింగ్ మరియు సైన్సెస్) డాక్టర్ ఎ. రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి. సురేష్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం హెడ్ డాక్టర్ మాకినీడి రాజాబాబు పాల్గొన్నారు.

## కానూరు పంచాయతీలో గ్రామసభ




**పెరవలి,మేజర్‌న్యూస్** : కానూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో అక్టోబర్ 21వ తేదీ మంగళవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పై గ్రామసభ సమావేశం సర్పంచ్ భావన మధు పూర్ణ చందు అధ్యక్షతన జరిగింది.ఈ సభలో 2025-26 సంవత్సరానికి గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి హామీ కింద కొత్త పనుల ప్రతిపాదనలు,పాత పనుల సమీక్ష, వేతన చెల్లింపులు, నీటి సంరక్షణ కార్యక్రమాలు, పచ్చదనం చర్యలు, మరియు మహిళల భాగస్వామ్యం వంటి అంశాలపై చర్చ జరిగింది.గ్రామసభలో ప్రజల అభిప్రాయాలు సేకరించి, వారి అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతా క్రమంలో పనులు నిర్ణయించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలోని ప్రతి కుటుంబానికి అవసరమైన పనిని అందించడం, పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామ అభివృద్ధి లక్ష్యంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మధు మాట్లాడుతూ ప్రతి గ్రామస్థుడు ఉపాధి హామీ పథకం ప్రయోజనాలు పొందేలా కృషిచేయాలి.పారదర్శకతతో పనులు జరగాలని అధికారులు దృష్టి పెట్టాలి అన్నారు. ఈ గ్రామసభలో పాల్గొన్న ప్రతి ఒక్కరు ఈ పథకం అమలులో చురుకైన పాత్ర వహించాలని, గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో సహకరించాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలోగ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి టి రాంబాబు మరియు ఉపాధి హామీ పథక సిబ్బంది పాల్గొన్నారు.

## శివాలయంలో ఎమ్మెల్యే రాజప్ప ప్రత్యేక పూజలు



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్** : పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీ విశ్వేశ్వర చంద్రశేఖర స్వామివార్ల దేవస్థానం నందు మంగళవారం అమావాస్య సందర్భంగా పెద్దా పురంశాసన సభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, ఆయన కుమారుడు నిమ్మకాయల రంగనాగ్‌లు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈయన వెంట టిడిపి నాయకులు, దేవస్థాన ఇఓ కె.జగదీశ్వరరావు, సిబ్బంది, ఉన్నారు.

# పోలీసు అమర వీరులకు ఘన నివాళి

**-సేవా స్ఫూర్తి - సమాజ భద్రతకు ప్రతీకగా పోలీసుల త్యాగం**
**-మంత్రి కందుల దుర్గేష్,కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి నరసింహ కిషోర్**



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** అమరులైన పోలీసు సిబ్బందికి ఘన నివాళి అర్పిస్తూ రాజమహేంద్రవరం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన "పోలీస్ కమేమరేషన్ దే"కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో రాష్ట్రపర్యాటక,సాంస్కృతిక, సినిమా టోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జిల్లా పోలీసు అధికారి డి.నరసింహ కిషోర్ తదితరులు పాల్గొని అమరుల త్యాగాలకు పుష్పాంజలి ఘటించారు.మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, "సమాజంలో శాంతి భద్రతలనుకాపాడే కీలక బాధ్యత పోలీసులు నిర్వర్తిస్తున్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన 191 మంది అమరుల వీరోచిత సేవలను స్మరించుకోవడం గర్వకారణం.కుటుంబం కంటే ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇచ్చే మీసేవలు అమూల్యం.రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల పట్ల నిబద్ధతతో ఉంది," అని అన్నారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, "1959 అక్టోబర్ 21న లడక్ ప్రాంతంలో చైనా దాడుల సందర్భంగా సిఆర్పిఎఫ్ జవానులు ప్రాణత్యాగం చేశారు. ఆ సేవా స్ఫూర్తిని , వారి ప్రాణ త్యాగంను స్మరించుకుంటూ నివాళులు అర్పించడం జరుగుతోందన్నారు. ప్రతిఒక్క పోలీసుసిబ్బంది ఆత్మనిబద్ధతతో పని చేయాలని, వారి కుటుంబ సభ్యుల సహకారం విలువైనదని గుర్తించాలి," అని తెలిపారు. సభాధ్యక్షులు ఎస్పీ డి.నరసింహ కిషోర్ మాట్లాడుతూ, "దేశ భద్రత కోసం త్యాగం చేసిన అమరుల జ్ఞాపకార్థం నిర్వహించే ఈ కార్యక్రమం ప్రతి పోలీసు సిబ్బందికి స్ఫూర్తిదాయకం అన్నారు. మాదక ద్రవ్యాలు, సింథటిక్ డ్రగ్స్ వంటి సామాజిక సమస్యలను ఎదుర్కోవడంలో పోలీసు వ్యవస్థ మరింత కృషి చేయాలి," అని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, అడిషనల్ ఎస్పీలు (అడ్మిన్) ఎన్.బి.ఎం. మురళి కృష్ణ, (లా అండ్ ఆర్డర్) ఏ.వి. సుబ్బరాజు, (ఏ ఆర్) ఎల్. చెంచి రెడ్డి, డీఎస్పీలు (ఎస్.బి) బి. రామకృష్ణ, (నార్త్ జోన్) వై. శ్రీకాంత్, (ఈస్ట్ జోన్) బి. విద్య, (సౌత్ జోన్) కిషోర్, (కొవ్వూరు) దేవకుమార్, (ఏ ఆర్) రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా అమరులైన 191 మంది పోలీసుల పేర్లు చదివి వారికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథి, ప్రత్యేక ఆహ్వానితులు, తదితరులు చివరగా స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి గౌరవవందనంసూచికగా నివాళులు అర్పించారు.

# రాజకీయలకు అతీతంగా కాపు వన సమారాధన..

**కాపు సద్భావన సంఘం వన సమారాధనకు ముమ్మర ఏర్పాట్లు...**
**ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే పంతం నానాజీ...**
**నవంబర్ 16 ఆదివారం కార్తీక మాస వన సమారాధన...**



**కాకినాడరూరల్,మేజర్‌న్యూస్:** ఆహ్లాదకరమైన వాతావరణంలో వచ్చే నెల నవంబర్ 16, కార్తీక మాసం ఆఖరి ఆదివారం కాపు సద్భావన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు రూరల్ ఎమ్మెల్యే, సంఘ పెద్దలు పంతం నానాజీ స్పష్టం చేశారు. స్థానిక ఆర్టీవో ఆఫీస్‌రోడ్‌లో ఉన్న శుభం కాపు కళ్యాణ మండపంలో సంఘ గౌరవ అధ్యక్షులు బసవా ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీకమాస కాపు వనసమారాధన కమిటీ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే పంతంనానాజీ ముఖ్య అతిథిగా విచ్చేసి జీవితకాల సభ్యులు, కార్యవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవఅధ్యక్షులు బసవా,కార్యదర్శిచిట్నీడి ఎమ్మెల్యే నానాజీకి పట్టు కండువావేసి , పుష్పమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ సంఘానికి ఆనాడు ఆకుల శివయ్య నాయుడు నుండి కొమ్మిరెడ్డి వీరభద్రరావు,పోతుల సీతారామమూర్తి, పంతం నానాజీ వారి తండ్రి పంతం బాబురావు ఇలా ఎంతోమంది పెద్దలు సమిష్టి కృషితో ఉమ్మడి రాష్ట్రంలోనే అతిపెద్ద కాపు సద్భావన కాపునాడు సంఘంగా ఏర్పడి ఎంతో మందికి ఆదర్శంగానిలిచింది అనంతరం ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు నాయకులు పాల్గొనాలి అని కుల సమావేశంలో రాజకీయ ఉపన్యాసాలు ఉండకుండా చూడాలి అని పిలుపునిచ్చారు.సంఘకార్యవర్గం ప్రతి 2 సంవత్సరాలకు ఒకసారి మార్పు చేయాలని నూతన కార్యవర్గం ఏర్పాటు చేసినట్లు అయితే నూతన ఆలోచనలు అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు మాధవరపుపట్టాభిరామయ్య, వినాయక మాధవరావు, అడపా ప్రకాష్ నాయుడు,కార్యవర్గ సభ్యులు ఇమ్మడిశెట్టి వెంకటరమణ, జానపాముల నాగబాబు, సంగిశెట్టి రాంబాబు, రంబాల వెంకటేశ్వరరావు,మాదారపు తాతాజీ, తూము బన్ను, సలాది శ్రీనివాస్ బాబు, సిరంగి శ్రీనివాస్, సకలా రామకృష్ణ, దామిశెట్టి శ్రీనివాస్, బిందానసురేష్, కోన ఉమేష్, కొప్పిశెట్టి శ్రీను, ఆర్ రాజా, నూకల నారాయణరావు,హిట్లర్, పార్థసారథి, గేదెల చిన్నారావు, గోపు రమణ, ముద్దన సూర్య ప్రకాష్, తదితర సభ్యులు పాల్గొన్నారు.

# ఏపీకి గూగుల్ రాకతో గ్లోబల్ కనెక్టివిటీ హబ్‌గా మారనున్న విశాఖ

**- మంత్రి కందుల దుర్గేష్**
**-తద్వార ఐటీతో పాటు ఇతర రంగాల్లోనూ వృద్ధికి, ఉపాధికి విస్తృత అవకాశాలుంటాయని పేర్కొన్న మంత్రి దుర్గేష్**



**నిడదవోలు,మేజర్‌న్యూస్ :** ఏపీకి ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్ రాకతోవిశాఖపట్నం గ్లోబల్ కనెక్టివిటీ కేంద్రంగా మారనుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ లు ప్రత్యేక దృష్టి సారించి ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్ ను ఏపీకి తీసుకొచ్చారని, అది వైజాగ్ లో ఏర్పాటు కాబోతుందని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఏఐ హబ్, డేటా సెంటర్ ఐటీ రంగంలో ఏపీని శరవేగంగాదూసుకెళ్లేందుకు దోహదపడున్నాయన్నారు. రాష్ట్ర ఐటీ రంగాన్ని మలుపుతిప్పే గేమ్ ఛేంజర్ గా నిలవనున్న ఈ డేటా సెంటర్ 12 దేశాలకు అనుసంధానం చేయబడుతుందని వివరించారు. ఇక్కడ డేటా స్టోరేజీతో పాటు కృత్రిమ మేధా ఆధారిత అప్లికేషన్స్‌ను ప్రాసెస్ చేసేందుకు అవసరమైన కంప్యూటింగ్ సదుపాయాల్ని సమకూర్చనుందని, రాబోయే రోజుల్లో డేటా సెంటర్ ు అనుబంధంగా ఏర్పాటయ్యే కంపెనీలతో పరోక్షంగా లక్షలాది మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశముందన్నారు.ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికి కూడా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమం,అభివృద్ధిని సమపాళ్లలో కొనసాగిస్తుందని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.

## 49 మంది బాధితులకు రూ.22.44 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి దుర్గేష్



**నిడదవోలు, మేజర్ న్యూస్ :** ఇప్పటివరకు నియోజకవర్గంలో సీఎం సహాయ నిధి క్రింద 437 మందికి రూ.3.32 కోట్ల లబ్ది చేకూర్చామని మంత్రి దుర్గేష్ అన్నారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పేదల ఆరోగ్యానికి సిఎంఆర్ఎఫ్ భరోసా ఇస్తుందని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం, అత్యవసర వైద్య చికిత్స అవసరమైతే సాయం అందించడంలో మంత్రి కందుల దుర్గేష్ ఎప్పుడు ముందుంటారని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లకు హృదయపూర్వక కృతజ్ఞతలు మంత్రి దుర్గేష్ తెలిపారు.

# ధ్యాన్ చంద్ ఖేల్ రత్న,అర్జున, ద్రోణాచార్య అవార్డులు

**– 2026 దరఖాస్తుల ఆహ్వానం**



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం అందించే అత్యున్నత క్రీడా పురస్కారాలు మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న, అర్జున, ద్రోణాచార్య అవార్డులతో పాటు రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారాలు – 2026కు సంబంధించి అర్హులైన క్రీడాకారులు, కోచ్‌లు మరియు సంస్థలు తమ దరఖాస్తులను సమర్పించ వలసిందిగా జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డి. ఎం. ఎం. శేషగిరి మంగళవారం ఒక ప్రకటనలో తెలియ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆసక్తిగల అభ్యర్థులు 2025 అక్టోబర్ 28 రాత్రి 11.59 గంటల లోపు కేంద్ర ప్రభుత్వ క్రీడా శాఖ అధికారిక వెబ్‌సైట్ https://dbtyas-sports.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలనీ తెలియ చేయడం జరిగింది. దరఖాస్తు విధానం, అర్హత నిబంధనలు మరియు ఇతర వివరాల కోసంపై పేర్కొన్న వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు అని తెలియచేశారు.

# మహిళల స్వయం ఉపాధికి ఊతం

**వృత్తి నైపుణ్య శిక్షణలతో మహిళల్లో ఆత్మ స్థైర్యం**
**మంత్రి వాసంశెట్టి సుభాష్**

**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :** మహిళలు వృత్తి నైపుణ్య శిక్షణలు తీసుకోవడం ద్వారాస్వయం ఉపాధికి బాటలు వేసుకోవడంతోపాటు, వారిలో ఆత్మ స్థైర్యం కలుగుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగుల తయారీ, చేనేత మగ్గం వర్క్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు స్థానిక జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మంత్రి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యంలు పాల్గొని సర్టిఫికెట్లు,కిట్లు చేనేత మగ్గాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ మహిళలకు స్వయంఉపాధికల్పన ధ్యేయంగా రామచంద్రపురం నియోజవర్గంలో పలు వృత్తి విద్య నైపుణ్య శిక్షణలు ఇచ్చి మహిళల్లో స్వయం ఉపాధికి కృషిచేస్తున్నామన్నారు. ఉపాధి అవకాశాలు లేని మహిళ లు, వితంతువులకు ప్రాధాన్యత ఇచ్చిపలుశిక్షణలు ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ప్రతి ఏటా లక్ష మందికి పైగా మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే బ్యూటీషియన్, కుట్టు మిషన్ శిక్షణ, గృహపకరణాల తయారీ, మగ్గంపై వర్క్, జ్యూట్ బ్యాగుల తయారీలో



నిపుణులతో శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. శిక్షణతో పాటు సర్టిఫికెట్లు, బ్యాంకు రుణాలు కూడా పొందేల సంబంధిత అధికారులతో మాట్లాడామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు, మంత్రి సుభాస్ సహకారంతో భవిష్యత్తులో మరిన్ని సేవాకార్యక్రమాలు నిరంతరప్రక్రియగా నిర్వహిస్తామన్నారు.అనంతరం శిక్షణపూర్తిచేసుకున్న 140మంది మహిళలకు సర్టిఫికెట్లు, 21మంది మహిళలకు ఉచితంగా మగ్గాలుపంపిణీచేశారు.ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ తాడి శ్రీనివాస్, డైరెక్టర్ జయ, ట్రైనర్స్ రమేష్, కుమారి,కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు